ఎ.ఆర్.రెడ్డి మెమోరియల్ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# పూర్ణ పురుషుడు

- కోరుకొండ సత్యానంద్

అహల్య చిట్టిబాబు వీపు మీద దబదబా బాదింది. అప్పటికీ ఆవేశం తగ్గక వేళ్ళను ముడిచి వాడి నెత్తి మీద గట్టిగా మొట్టింది.

ఇందాక అహల్య కంగారు పడింది. కిందా మీదా పడి చిట్టిబాబు నెత్తుకొని బస్సెక్కింది. దారిలో రిపేరొచ్చి ఆ బస్సాగిపోయింది. అహల్య బస్సు దిగిపోయింది. హైరానా పడుతూ చేతిలో ఉన్న డబ్బు లెక్కెట్టుకుంది. ఆ డబ్బుకి ఆటో దొరకడం కష్టమైపోయింది. అందుకు మరింత ఆలస్యమైపోయింది. ఎలాగో ఒక ఆటోవాడి దయతో వెళ్ళాలనుకున్న చోటికి వెళ్ళింది. అన్ని పాట్లు పడినా ఫలితం దక్కలేదు.

అప్పటికే చాలా ఆలస్యమై పోయింది!

అహల్య కష్టపడదామనుకుంది. అయినా అమెది ఫలం దక్కని కష్టమే అయ్యింది. అందుకే కన్నీరు గిర్రున తిరిగింది వెర్రిగా. వెనక్కి ఎలా వచ్చిందో...? వచ్చి ఇంట్లో కూలబడిపోయింది.

సరిగ్గా అప్పుడే చిట్టిబాబు... "ఆకలి"... అని మొదలుపెట్టేడు. క్రమంగా ఏడుపుగా మార్చేసేడు. ఆ ఏడుపు అహల్య సహనానికి పరీక్ష పెట్టింది.

అందుకే... అహల్య చిట్టిబాబు వీపు మీద దబ దబా బాదింది. అప్పటికీ ఆవేశం తగ్గక వ్రేళ్ళను మడిచి నెత్తి మీద గట్టిగా మొట్టింది.

చిట్టిబాబు గుక్కపెట్టి ఏడ్చేడు. అలా ఏడుస్తోన్న కొడుకుని చూడలేక చేతుల్తో నుదుటి మీద బాదుకుంది. చేతి గాజులు కొన్ని పగిలాయి. కుడిచేతి మణికట్టు దగ్గర తెగి కొద్దిగా రక్తం కారింది. అవేమీ పట్టించుకొనే స్థితిలో లేదు అహల్య. గుండెలోంచి ఉబికి వస్తోన్న దుఃఖాన్ని అదుపు చేసుకోలేక తను కూడా బోరున ఏడ్చేసింది!

తల్లి కూడా ఏడవడం చూసి, తనే కొట్టి మళ్ళీ తనే ఎందుకు ఏడుస్తోందో అర్థం కాక ఏడుపు ఆపేసి విచిత్రంగా తల్లి వైపు చూసాడు చిట్టిబాబు. కొడుకు ఏడుపు ఆపేయడంతో వాడ్ని తన దగ్గరకు తీసుకుంది.

గట్టిగా గుండెకు హత్తుకుంది.

"నేనేడవడం చూసి నువ్వు ఏడుపాపు చేసేవేరా. నేనేడిస్తే... నువ్వేడవ్వా? అలా అయితే... నేనెప్పుడూ ఏడుస్తూనే ఉంటానులేరా... చిట్టీ... నా కన్నా..." ఏడుపు నిండిన గొంతులోంచి వణుకుతోన్న అహల్య పెదాల ద్వారా బొంగురుగా వచ్చాయి ఆ మాటలు.

"ఎవరో స్నేహితురాలి పెళ్ళి అని చెప్పి... మీరిద్దరూ భోంచేసి నాకూ కొద్దిగా తెస్తానని చెప్పి వెళ్లేవు... అదేమిటే ఇంటికొచ్చేసి వాడ్ని చితకబాదుతున్నావు. ఏం చేసేడు వాడు?"

తల్లి మాటలు విని, దుఃఖాన్ని దిగమింగుకొని, కళ్ళు తుడుచుకొని... తల, చీర సర్దుకొని, చిట్టిబాబు నెత్తుకొని... "ఏమీ లేదు. నువ్వు పడుకో. ఇప్పుడే వచ్చేస్తాను" అని చెప్పి బయటకు దారి తీసింది అహల్య.

తల్లి కుడిభుజం మీద వాలి ఉన్న చిట్టిబాబు ఏడుపు మరిచిపోయి దారిలో కన్పిస్తోన్న వాహనాల్ని హుషారుగా చూస్తున్నాడు. అహల్య రోడ్డు ప్రక్కగా నడుస్తోంది. లైటు వెలుగులో ఆమె దృష్టి తన ఎడమ చేతి మీద పడింది. ఆ చేతి గాజులు అన్నీ ఇందాక పగిలి, కింద పడిపోయాయి, ఒక్కటి తప్ప. అదీ ఇందాకే పగిలి ఉందేమో, చిట్టిబాబును భుజం మార్చుకోవడంలో అది కూడా చిన్న శబ్దం చేసి రెండు ముక్కలై క్రింద పడిపోయింది. ఎడమ చేతికి మాత్రం రెండు గాజులు మిగిలాయి.

అప్పుడే... ఓ నలుసుని తనకు మిగిల్చి ఎక్కడికో పారిపోయిన ఓ వ్యక్తి గుర్తొచ్చేడు!

అహల్యకు పెళ్ళయ్యింది. పెళ్ళయిన రెండో సంవత్సరంలో చిట్టిబాబు పుట్టేడు. చిట్టిబాబుకి ఆ పేరు అహల్య భర్తే పెట్టేడు. ఆ పేరు ఎందుకో అహల్యకు నచ్చలేదు. ఇష్టం లేనిది పేరే గానీ బొద్దుగా పండులా ఉన్న కొడుకు కాదు కాబట్టి, ఆ పేరుని పెట్టింది వాడి కన్న తండ్రే కాబట్టి దానిని మార్చలేదు. 'చిట్టీ' అని పిలవడం అలవాటు చేసుకుంది.

కట్టుకున్న వాడు ఎక్కడికో పారిపోయాడని ఏడుస్తూ ఖాళీగా కూర్చోలేకపోయింది అహల్య. బయటకు వచ్చింది. ఏమీ చేయలేని ముసలి తల్లినీ, మెదడంతా బుల్లి బుల్లి ఆలోచనలతోనే నిం... ఉన్న చిట్టి బాబునీ, తనని తానూ పోషించుకోడాని కి చిన్న చిన్న ఉద్యోగాలు చేసింది. ఇప్పుడు చేస్తున్నదీ చిన్న ఉద్యోగమే! ఎంత జాగ్రత్తగా చేసినా నెలకొక పది రోజుల కంటే ఎక్కువ కడుపు నింపలేని సంపాదనే ఎప్పుడూ తనది.

అందుకే ఇందాక అహల్య కంగారు పడింది. హైరానా పడింది. నీరుగారిపోయింది. కన్నీరు పెట్టుకుంది. ప్రాణంతో సమానంగా చూసుకొనే 'చిట్టి'ని చితక బాదింది.

బస్సు దొరకడంలో, అది ఆగిపోవడంలో జరిగిన ఆలస్యం ఆటో ఎక్కి వెళ్ళినా ఆలస్యం అవ్వక తప్పింది కాదు. అనుకున్న ప్రదేశానికి వెళ్లి పరిసరాల్ని ఆత్రుతగా చూసింది.

'వాళ్ళు' అక్కడ లేరు. తను రాకపోవడంతో వెళ్లిపోయి ఉంటారని అనుకుంటూనే నిస్పృహగా ఎవర్నో టైం అడిగి తెలుసుకుంది.

అంటే... దాదాపు గంట లేటు చేసిందన్న మాట తను. అందుకే వాళ్ళు వెళ్ళిపోయి ఉంటారు. ఖచ్చితంగా వాళ్ళు రావడం మానేసి ఉండరు. వచ్చి, వెయిట్ చేసి, వెళ్ళిపోయి ఉంటారు. తనను తిట్టుకొని మరీ వెళ్ళిపోయి ఉంటారు.

లేదు, లేదు... తనను తిడితే ఆ రెండో వ్యక్తి తిట్టి ఉంటాడేమో గానీ... 'అతను' మాత్రం తిట్టి ఉండడు. ఎందుకంటే అతనికి మనసుందని ఆ కాస్త పరిచయంలోనే అర్థమైంది అహల్యకు.

"నేను రానేమో... వచ్చినా వీడికోసమే వస్తాను. వీడికి తోడుగా మాత్రమే వస్తాను..."

"వద్దండీ.., బాబుని తీసుకు రావొద్దు. అలాంటి సంఘటనను నేను భరించలేను".

అతనన్న ఆ రెండు మాటలే అహల్య అలా అనుకోడానికి కారణం!

అ రెండో వ్యక్తివైతే ఏ మాత్రం ఒప్పించ నక్కర లేకపోయింది గానీ అతన్ని మాత్రం ఒప్పించాల్సి వచ్చింది. సాకుగా మరేదో చెప్పి ఒప్పించింది గానీ అకలయ్యే సమయానికి వాడి కడుపు నింపడానికే చిట్టిబాబుని తీసుకొస్తున్నానని మాత్రం చెప్పలేదు.

కేవలం 'అతను' తట్టుకోలేకపోవచ్చునే!

తన ఇంటికి దూరంగా తాము కలుసుకోవాల్సిన ప్రదేశాన్ని చెప్పింది. సిటీలో తను మసలే ప్రదేశాలకు దూరంగా ఉండే మరో ప్రదేశాన్ని తాము కలిసి వెళ్ళడానికి సూచించింది.

వాళ్ళు 'అలాగే' అన్నారు.

అంతా... కేవలం తాను చేసిన అలస్యం వల్లనే ఏమీ జరగకుండా పోయింది. అనుకున్నది జరగనందుకు వాళ్ళెంత నిరాశకు గురై ఉంటారో తను ఊహించగలదు గానీ... "నేనెంత నిస్పృహకు గురి అయ్యానో వాళ్ళు ఊహించి ఉండరు" అనుకుంది.



అలా అనుకున్నప్పుడు మళ్ళీ అహల్యకు 'అతనే' కళ్ళలో మెదిలాడు!

అలాంటి ఇద్దరు... స్నేహితులెలా అయ్యారో అర్థం కాలేదు అహల్యకు. కానీ అతనేమిటో మాత్రం అర్థమైంది. రెండో వ్యక్తి మనసులేని వాడన్న నిర్ధారణకు రాలేదు గానీ, అతను మాత్రం మనసున్న మనిషని మాత్రం మనస్ఫూర్తిగా అనుకుంది అహల్య. నిజానికి 'అహల్య'కు కావాల్సింది అతనిలాంటి వాళ్ళు కాదు. ఆ రెండో వ్యక్తిలాంటి వాళ్ళే ఆమెకు ఆధారమవుతున్నారు.

నడుస్తూ ఓ ప్రక్క వాళ్ళ గురించి ఆలోచిస్తున్నా... ఇప్పుడెక్కడికి వెళ్ళాలి, ఏం చేయాలి అని కూడా ఓ ప్రక్క ఆలోచిస్తోంది. ఏమీ పాలుపోక పోయినా ఎక్కడికో అలా నడుస్తూనే ఉంది.

ఆ ఇంటి మగవాడు చెప్పా పెట్టకుండా మాయమైన తర్వాత ఓ నిస్సహాయ పరిస్థితిలో ఎప్పుడూ వెకిలిగా చూసే ఓ వ్యక్తికి తప్పని సరై తల వంచింది అహల్య.

అ తర్వాత క్లిష్టమైన పరిస్థితుల్లో అతని ద్వారా తెలిసిన వాళ్ళ దగ్గర, మళ్ళీ వాళ్ళ ద్వారా మరి కొందరి దగ్గరా తల వంచింది.

మొదటి వ్యక్తి తన గుట్టు రట్టు చేయకుండా ఉండడమే అతని మంచితనం అనుకుంది. అలాంటి వాళ్ళు తనకు తారస పడ్డం తన అదృష్టం అని కూడా అనుకుంది.

'అమ్మా... ఆ..కలి...'

చిట్టిబాబు ఈ సారి మెల్లిగా అన్నాడు. ఇందాకటిలా అహల్యకు కోపం రాలేదు. చిట్టిబాబు తల నిమిరింది. లాలిస్తున్నట్లుగా. తన నిస్సహాయతను తెలియజేస్తున్నట్లుగా. అప్పుడు తగిలాయి అహల్య చేతికి చిట్టిబాబు తలమీద రెండు బుడిపెలు గట్టిగా, వెచ్చగా. గుండె తరుక్కుపోయింది. వస్తోన్న ఏడుపుని అతి కష్టం మీద ఆపుకోగలిగింది గానీ ఎగసెగసి పడుతోన్న గుండెను అదుపు చేయలేకపోయింది.

సరిగ్గా అలాంటి సమయంలోనే ఆమె దృష్టి అటువైపు పడింది.

అక్కడ ఏం జరుగుతుందో అహల్యకు తెలుసు.

అక్కడున్న రద్దీ కాస్త తగ్గాక ఒక్కసారి చిట్టిబాబు వైపు చూసింది. తర్వాత చిన్నగా నిట్టూర్చి ఏదో నిర్ణయానికి వచ్చినట్లుగా చిట్టి బాబుని క్రిందకు దింపింది.

"చిట్టీ. అక్కడికి వెళ్ళి... నిలబడు".

తల్లి వ్రేలు పెట్టి చూపించిన వైపుకి చూసాడు చిట్టిబాబు.

అక్కడ చిన్న పందిరిలాంటిది ఉంది. పందిరిలో లైటు ఉంది. ఆ లైటు క్రింద ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు.

వారిద్దరి చుట్టూ కొంతమంది మూగి ఉన్నారు. ఇద్దర్లో ఒకాయన చిన్న బల్ల దగ్గర కూర్చున్నాడు. రెండో వ్యక్తి ఆకు తీసి అందులో చిన్న గిన్నెతో కొలిచి అన్నాన్ని దాని మీద ఓ గరిటతో పాంబారుని వేస్తున్నాడు.

అమ్మ వెళ్ళమన్నదంటే అక్కడ అన్నం పెడతారని అర్థం చేసుకున్నాడు చిట్టిబాబు.

చిట్టిబాబుకైతే తెలియదు గానీ... అది నేడు బీదలు అతి తక్కువ ధరకు కడుపు నింపుకొనే ప్రదేశమనీ, వాళ్ళు ఏం పెట్టినా ఎలాంటిది పెట్టినా ఇదేమిటనీ, ఎవ్వరూ అడగరనీ, వాళ్ళిస్తున్న డబ్బుకి అంత తిండి ఎక్కడా దొరకదనీ... అహల్యకు మాత్రం తెలుసు.

అయినా చిట్టిబాబుని అక్కడికి వెళ్ళమంది.

అదీ డబ్బులిచ్చి కాదు. చిల్లర ముష్టెత్తుకొనేవాళ్ళు సైతం కొనుక్కొని తినేదాన్ని 'అకలి' అని చెప్పి అడుక్కు తినమని.

మళ్ళీ ఒక్కసారి ఎందుకో తల్లి వైపు చూసాడు చిట్టిబాబు.

"వెళ్ళరా... అక్కడికి వెళ్ళి నిలబడు. వాళ్ళు నీ వైపు చూసినప్పుడు... నన్నడిగినట్టే వాళ్ళని అడుగు. ఆకలి అని చెప్పి అన్నం పెట్టమని అడుగు...'

కన్నీరెండిపోయిన అహల్య కళ్ళు ఓ కన్నీటి చుక్కనైనా కారుద్దాం అని విఫల ప్రయత్నం చేసాయి అలా అంటున్నప్పుడు.

అప్పటికి అంతకంటే ఏమీ చేయడానికి తోచింది కాదు అహల్యకి.

తల్లి చెప్పిన మాటలు విని చిట్టిబాబు అడుగు అటువైపుకి వేయబోతున్నప్పుడు అహల్యకు నరాలు తెగిపోతున్నట్లనిపించింది.

ఆ బాధను తట్టుకోలేక వెళ్తోన్న చిట్టి బాబుని ఆపబోయింది. మళ్ళీ ఆ బాధకే బలైపోవడానికి నిశ్చయించుకున్న అహల్య అయితే చిట్టిబాబుని ఆపలేదు గానీ...

మరో చేయి చిట్టిబాబుని ఆపింది.

తల వెనక్కి త్రిప్పి చిట్టిబాబు, ప్రక్కకు త్రిప్పి అహల్య అటువైపు చూసారు.

ఎవరో చిట్టిబాబుకైతే తెలియలేదు గానీ అహల్య మాత్రం గుర్తు పట్టింది.

... అతను...

"... మీరు మా వాడిని కలవలేదా?" మెత్తని గొంతుతో అడిగాడతను.

అహల్య తల దించుకొని... "నేను వెళ్ళడం చాలా ఆలస్యమైంది..." అంది.

"నా మిత్రుడు అన్న సమయానికి అక్కడికి వచ్చే ఉంటాడు...".


"మీరు... రాలేదా...?"

అతనేమీ మాట్లాడకపోయేసరికి తలెత్తి చూసింది అహల్య. అతనప్పుడే కొద్దిగా తలదించి...

"బాబుని తీసుకొస్తానని అన్నారుగా. ఆ పరిస్థితిని తట్టుకోలేను. అందుకే నేను రాలేదు...

... చాన్నాళ్ళ నుండీ మేమిద్దరం స్నేహితులం. అతనికిదో బలహీనత. వారించినా సమర్థించుకుంటూ ఏదో చెప్తాడు. ఆ ఒక్క బలహీనత కారణంగా స్నేహాన్ని కాలదన్నడం సరియైనది కాదని నా అభిప్రాయం. ఏ

# పరిచయం



రెండేళ్ళక్రితం అమృత్‌కిరణ్ కథలపోటీ ప్రకటించినప్పుడు సరదా పడ్డాను. కొత్త పత్రిక్కి ఒక మంచి కథ పంపించాలనుకున్నాను. పంపించాను ప్రథమ బహుమతి పొందాను. క్రిందటేడు 'అమెరికా తెలుగు సంఘం - అమృత్‌కిరణ్ పక్షపత్రిక సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో 'కాల్చుకొకు జీవితాన్ని' కథకు ద్వితీయ బహుమతి పొందాను. ఇప్పుడు 'పూర్వ పురుషుడు' కథకి మళ్ళీ ద్వితీయ బహుమతితో హేట్రిక్ సాధించానని సంతోషిస్తున్నాను.

ఇప్పటి వరకు దాదాపు 200 కథలు, అసంఖ్యాకంగా కార్టూన్లే (సత్యానంద్ పేరిట) రాశాను. పదికి పైనే బహుమతులు పొందాను. హిందీ, కన్నడం భాషల్లో కొన్ని కథలు అనువదింపబడినవి. 1994లో ఒక టీవీ ఎపిసోడ్‌కు కథ-మాటలు సమకూర్చాను.

- కోరుకొండ సత్యానంద్,
86-7-7, తిలక్‌రోడ్,
రాజమండ్రి - 533 103.

బలహీనతా లేని వ్యక్తితోనె స్నేహం చెద్దామంటే ఎవరికి ఒక్క స్నేహితుడూ ఉండకపోవచ్చు. బలహీనతలనాధారం చేసుకొని విడిపోతే ఒక్క స్నేహితుడూ మిగలక పోవచ్చు. స్నేహంలో కూడా సర్దుబాటులుండాలి... ఏది ఏమైనా అతను మంచి స్నేహితుడు...

ఒక్క నిమిషం వాళ్ళిద్దరి మధ్యా మౌనం...

"... నేను వెళ్ళడం ఆలస్యమైంది. ఆయన వెళ్ళి పోయి ఉంటారు. ఎక్కడుంటారో మీకు తెలుసా?" చాలా ఆతృతగా అడిగింది అహల్య.

"తెలుసు. ఇంటికెళ్ళిపోతాడు. భార్యాబిడ్డలు, తల్లిదండ్రులూ ఉన్నవాడే అతను."

"ఆడదాన్ని కొనుక్కొనే అలాంటివాళ్ళు లేకపోతే నాలాంటి వాళ్ళ పరిస్థితి ఏమవుతుందో మీకు తెలీదు. అందుకే ఈ పూట నా కొడుకు కడుపు నింపడానికి..." ఇంకా ఏదో చెప్పబోతున్న అహల్య మాటలకు అడ్డు పడ్డాడతను.

"చూసానండీ... మీ పరిస్థితిని అర్థం చేసుకోగలను. ఈ సమాజం ఎంత ఉన్నతికి ఎదిగిందో అంత దుస్థితికీ దిగజారింది. జాతికి ఆ ఉన్నతినే ఆపాదించేవాళ్ళకు ఈ దుస్థితి కన్పించదు. కేవలం మాట్లాడ్డానికి, మీ మాటల్లోంచి ఓ కవితను తయారు చేసి సమాజానికి విన్పించడానికి నేను కూడా వద్దామనుకున్నాను.

కానీ బ్రతుకంటే తెలియని చిన్నారి ప్రక్కన అలాంటి కలయికను చూస్తూ...... అందుకే నేను ఆఖరు నిముషంలో విరమించుకున్నాను. రోడ్ల మీద ఈ శరీరం తిరుగుతున్నా మీ బాబు ప్రక్కన ఆ సంఘటన మనసు మీద ముద్రపడుతూ నాలో ఏవో భావాల్ని ఉత్పన్నం చేస్తున్న సమయంలో మీరు కన్పించారు.

మీ మాటలు విన్పించాయి. ఇంతవరకూ మెదులుతూ వరుస క్రమంలో మనసు పొర మీద అమరబోతున్న పదాలు చిందించబోయే భావానికి ఆ మాటలు అంతిమ రూపాన్నిచ్చేయి...".

అతనొక్క నిముషం ఆగాడు.

అహల్య మౌనంగా అతని వైపే చూస్తుంది. చిట్టిబాబు అతనినీ, తల్లినీ మార్చి మార్చి చూస్తున్నాడు.

"మీ జీవితంలోంచి కవితనల్లుకొని నా గూటిలోకి నేను వెళ్ళిపోతే నేను కవినవ్వగలిగినా మనిషిని కాలేమోనని మీ బాబుని అపాను. పసిదనం, ఆకలి, నిస్సహాయత ఇలాంటి వాటి గురించి తెలిసిన వాడ్ని. అనుభవించిన వాడ్ని. కాబట్టి రమ్మంటున్నాను. నా మాట కాదనకుండా నాతో రండి..." అని చిట్టిబాబు చేతిని పట్టుకున్నాడతను.

తల్లివంకే చూస్తున్న చిట్టిబాబుని అతనెత్తుకొని కదిలేవరకూ చేష్టలుడిగిన దానిలా అహల్య అతనిని అనుసరించలేకపోయింది...

ఎందుకంటే, అహల్యతో అలాంటి మాటలు అన్న మొదటి వ్యక్తి అతనే.

కాసేపట్లో చిట్టిబాబు కడుపు నిండింది. అహల్య మనసు నిండింది. అప్పుడన్నాడతను.

"నాకు పెళ్ళయ్యింది. ఈ జీవితమే భారంగా గడుస్తోంది. ఆలోచనలు మనసును తొలిచేస్తుంటాయి. అలాంటప్పుడు కవితలు రాస్తుంటాను. అంతకంటే మరేమీ చెయ్యలేక. అందుకే మిమ్మల్ని జీవితాంతం ఆదుకొనే సంస్కర్తను కాలేకపోతున్నాను.

ఈ జీవితంలోంచి తప్పుకొని క్రొత్త జీవితాన్ని ప్రారంభించమని సలహానిచ్చే, అందుకు చేయూతనిచ్చే స్నేహితుడ్నీ కాలేక పోతున్నాను...

... గతి తప్పిన మీ జీవితం శృతి చేయగలిగే పూర్ణపురుషుడు మీకు తారస పడాలి. అతని చెంత మీ జీవితం ఏ చీకూ చింతా లేకుండా సాగిపోవాలి... అని ఆశ పడుతున్నాను. ఈలోగా... తప్పనప్పుడు నన్ను కలవండి. నాకు చేతనైంది తప్పకుండా చేస్తాను".

ఏదో కలగన్నట్లుగానే తల పంకించింది తప్ప బదులుగా ఏమీ అనలేకపోయింది-అహల్య.

"మీతో పాటూ ఎవరైనా ఉన్నారా?" అడిగాడతను.

"ఊ... అమ్మ"

ఆ మాట విని సర్వర్ని పిలిచాడతను. అహల్య అతనిని వారించబోయింది. అయినా అతను ఆగలేదు. కాసేపట్లో సర్వర్ ఓ పొట్లాన్ని తెచ్చాడు. దాన్ని అహల్యకు ఇచ్చాడతను. దాన్నందుకొని అహల్య ఏదో అనబోయింది. కానీ అంతలోనే అతను లేచి నిలబడ్డాడు.

బిల్లు చెల్లించి బయటకు వచ్చాక ఒక్క క్షణం అహల్య వైపు, చిట్టిబాబు వైపు చూసి ఆమె చేతిలో ఓ కాగితాన్ని పెట్టాడు. దాని వైపు పరిశీలనగా చూసింది అహల్య.

అది అతని అడ్రస్సు!

తలెత్తి చూసేలోగా అతను వెళ్ళిపోతూ కన్పించాడు.

ఒక అడుగు ముందుకేసి పిలవబోయింది. అంతలోనే...


"అమ్మా. నిద్దరొస్తుంది. ఎత్తుకోమ్మా" అన్నాడు చిట్టిబాబు.

వాడిని భుజానికెత్తుకొని మళ్ళీ అతను వెళ్ళి పోతున్నవైపు చూసింది.

అతవా వీధి మలుపు తిరిగిపోయేడు.

తాము ఆశించింది తాను అందించినందుకు అవసరమైన డబ్బునిచ్చి ఒక రకంగా చేయూతనిచ్చిన ఎందరో పురుషుల మధ్య... తన జీవితం శృతి చేయబడేంత వరకూ (?) అవసరమైనప్పుడు ఆదుకుంటానన్న అతనే పూర్ణ పురుషుడిలా అన్పించాడు అహల్యకు!


కొరుకొండ సత్యానంద్
86-7-7, తిలక్ రోడ్,
రాజమండ్రి - 533 103.


కె. శ్రీనివాస్ (కార్టూనిస్ట్), పోస్ట్: మల్లారం, మండలం: మల్హర్ - 505 184 జిల్లా: కరీంనగర్.